ఒ క బా ట సా రి

శ్రీ వాకాటి పాండురంగరావు

విసవిసా నడుస్తున్నారు శేషయ్య.

ఆయన విశాల ఫాలభాగంమీద దక్షాధ్వరధ్వంసవేళ పరమశివుడి ఛాయలు వెలుగుతున్నాయి. ఆ అరుణిమకు అంచుల వలె అమరిన గంధపు రేఖల మధ్య—నిజం లాగున నిలిచివుంది కుంకుమబొట్టు.

విసవిసా నడిచి వచ్చేస్తున్నారు శేషయ్య.

ఆయన వస్తున్నది ఇంటికి.

ఆయన వస్తున్నది పదిహేడేళ్లు చేసిన ఉద్యోగం విడిచి.

అప్పటి కాయనకు నలభై ఏడేళ్లు. ఇద్దరు పిల్లలు—అబ్బాయి ప్రసాదు, అమ్మాయి అపర్ణ.

అసలు జరిగిం దేమిటం టే—

ఓ గంట క్రింద శేషయ్యగారు యథావిధిగా కార్ఖానా ఆఫీసులో తన గదిలోకి వెళ్లి కూచున్నారు. టేబిల్‌మీది గాజుపలక క్రింది రాజరాజేశ్వరి పటాన్ని చూసి, కళ్లు మూసుకుని తెరిచారు. అమ్మవారి ప్రసన్నవదనంమీద ఒక్క క్షణం ఏదో నీడ మసలిన ట్లనిపించింది. అర్థంకాలేదు ఆయనకు. 'ఇదంతా నీ పరీక్ష లేవమ్మా'—అని నవ్వుతూ మనసులో నమస్కరించుకొని ఆఫీసు పనిలోకి అడుగు పెట్టారు. అర ఘంట తర్వాత ఎవరితోనూ కబురు పెట్టకుండా హఠాత్తుగా వేంచేశాడు మధుసూదనరావు.

వచ్చిన అయిదో నిముషం—"పంతులుగారూ ! నేనో చిన్నమాట చెబుతాను. మీరేమీ అనుకోకండి. రేపటినుండి మేనేజరుగా మరొకరిని నియమిస్తున్నాను. కనుక ఈ కార్ఖానాలో మీ యిష్టం వచ్చిన శాఖలో మీరు గుమాస్తాగా పని చేయవచ్చు. అయితే మీ జీతం మాత్రం ఇప్పు డున్నంతే ఉంటుంది"—అన్నాడు మధుసూదనరావు.

అని శేషయ్యగారి మొహాన్ని చూడలేకపోయాడు.

"మంచిది !" అన్నారు శేషయ్య.

లేచి వెళ్లిపోయాడు మధుసూదనరావు.

శేషయ్య కోటు జేబులోనుంచి కలం తీశాడు. టేబిల్‌మీది కాగితం తీయబోయి మానుకుని జేబులోని భగవద్గీత పుస్తకం తీశారు. దాని మధ్య మడిచిఉన్న తెల్ల కాగితం తీశారు. ఆ క్షణానఆయనమనసు లాగున నలిగిఉన్నది ఆ కాగితం. ఆ పోలిక గుర్తుకు వచ్చి నవ్వుకున్నా రాయన. నవ్వుకుని అమ్మవారి వైపు చూస్తే ఆమె ప్రశాంతంగా చూచింది. గబగబా ఉత్తరం రాశారు శేషయ్య. సంతకం పెట్టారు. తర్వాత తారీకు వేయబోయి కేలెండరువైపు చూశారు.

ఆరోజు—1947 వ సంవత్సరం డిసెంబరు ఆరవ తారీఖు !

ఇంత నిబ్బరంపు నీటిమధ్యా ఒక చిన్నరాయి వచ్చిపడింది.

దాదాపు పదిహేడేళ్ల క్రింద వినాయకచవితి రోజున కేవలం వెయ్యి రూపాయలతో చెన్నపట్నం చేరిన నారాయణయ్యను దైవం శేషయ్యతో కలిపాడు. నారాయణ ధనమూ, శేషయ్య ధీశక్తీ కలిసి—ఇనుపపెట్టెలు, ట్రంకులు చిల్లరగా అమ్మే వ్యాపారం మొదలయింది. అది రెండేళ్లలో టోకు వ్యాపారమయ్యింది. మరో అయిదేళ్లలో ఇనపపెట్టెలూ అవీ తయారు చేసే కార్ఖానాకు నారాయణ స్వంతదారు డయాడు. ఇంతటి అభివృద్ధి కేవలం తన డబ్బువల్లే రాలేదనీ, శేషయ్య తెలివి తేటలు, నిస్స్వార్థమయిన సేవా కూడా అందుకు కారణమనీ ఎరిగిన నారాయణ శేషయ్యని తన కార్ఖానాకు మేనేజరుగా నియమించి ఆయనకు నెలకు మూడు వందల జీతం ఏర్పాటు చేశారు. అంతేకాదు. ఆయనను అగ్రజుడి క్రింద భావించి గౌరవించాడు.

శేషయ్య కూడా కేవలం మేనేజరుగానే కాక, అది స్వంత వ్యాపార మయినట్లుగా శ్రద్ధ తీసుకొని దాని దినదినాభివృద్ధికి కృషిచేశారు. అవసర మయినప్పుడు రాష్ట్రమంతా తిరిగి తమ కార్ఖానా తయారుచేసే వస్తువులు బాగా వ్యాప్తిలోకి రావడానికి నిరంతర యత్నం చేశారు. అంతేకాదు—ఒక్కగానొక్క కూతురును పెళ్లిచేసి ఇంకొకరి ఇంటికి పంపివేసి వుండలేనని, నారాయణ బాధపడుతుంటే—ఆరు నెలలపాటు ఇనప చెప్పులు వేసుకుని తిరిగి, వూరూరూ గాలించి నారాయణ అమ్మాయి కో సంబంధం తెచ్చారు. సంబరం తెచ్చిన ఆ సంబంధం నిశ్చయమయింది. తల్లితండ్రులులేక, ఆస్తిలేక, ఉద్యోగం లేక ఉన్న మంచి అబ్బాయి మధుసూదనరావు నారాయణకు ఇల్లరికపు టల్లు డయ్యాడు. నారాయణ అమ్మాయి ఒకయింటి దయింది. మధుసూదనరావు జీవితానికి గరిమనాభి ఏర్పడింది. నారాయణకు అల్లు డొచ్చాడు; కాని అమ్మాయి ఇంట్లోనే ఉంది. అతగాడి దిగులు తీరింది. పదివేలసార్లు పంతులకు తన కృతజ్ఞత చెప్పుకున్నాడు. అమ్మాయి పెళ్లివేళ శేషయ్యనూ, పార్వతమ్మనూ ఘనంగా గౌరవించాడు నారాయణ. ఇదంతా అమ్మవారి చలవ అన్నారు శేషయ్య.

పెళ్లయిన తర్వాత మధుసూదనరావు భార్యతో కలిసి అయిదారు నెలలపాటు ఊళ్లు తిరిగాడు. ఆ సరదాలు తీరిన పిమ్మట

అతడిని తన కార్ఖానాలో అన్ని శాఖలూ తనిఖీచేస్తూ ఆ విధంగా పని తెలుసుకోమన్నాడు నారాయణ. శేషయ్యగారిని తండ్రిలా భావించమని కూడా చెప్పాడు. తల ఊపాడు మధుసూదనరావు.

ఈ లోపుగా భారతదేశం పరాయివాళ్ల పాలనను కాద న్నది. ఝాన్సీ లక్ష్మీబాయితో మొదలయిన కల నిజమయిన ఆ ఆగస్టు పదిహేను పర్వదినాన నారాయణ కార్ఖానాలో పండగ జరిగింది. అందరూ కలిసి ఆనందాన్ని కౌగలించు కున్నారు.

ఆ రోజుకు పక్షం తర్వాత ఒక రాత్రి నిద్రకని పడుకున్న నారాయణ మరి లేవలేదు. అల్లుడిని పిలిచి ఏదో చెప్పాడు. చెప్పి ఆఖరికి పంతుల్ని పిలవమన్నాడు. పరుగెత్తుకొచ్చారు శేషయ్య. ఆయన చేతులు పట్టుకుని "పంతులూ!" అని పిలిచి కన్ను మూశాడు నారాయణ. మధుసూదనరావు భోరు మన్నాడు. అతడి వీపు నిమిరారు శేషయ్య.

—అది, ఆరోజు, దాదాపు నాలుగు మాసాల క్రింద !

గత స్మృతుల పథం మీదికి వెళ్లిన శేషయ్య వర్తమానం లోకి వచ్చి తా నింతసేపూ కేలెండరువైపు చూస్తున్నట్లు తెలుసు కున్నారు. రాజీనామా ఉత్తరంమీద తారీఖు వేశారు.

యాభైఏళ్ల తర్వాత నారాయణ ప్రపంచాన్ని వదిలాడు.

తాను పదిహేడేళ్ల తర్వాత ఈనాడు ఉద్యోగం వదులు తున్నాడు—అనుకుంటూ కుర్చీలో నుండి లేచారు శేషయ్య. రాజీనామా లేఖను టేబిల్‌మీద ఉంచారు. గాజు పలక క్రింద అమ్మవారి పటాన్ని తీసి, కళ్ల కద్దుకుని, జేబులోని భగవ ద్గీత మధ్య పదిలపరచుకున్నారు. బయటకు నడిచారు.

—విసవిసా నడిచారు శేషయ్య.

ఇల్లు చేరిన శేషయ్య వసారాలో కుర్చీలో కూర్చు న్నారు. ప్రసాదూ అపర్ణా కాలేజీలకు వెళ్లిన వేళ చప్పు డేవిటా అని వసారాలోకి వచ్చిన పార్వతమ్మ ఆశ్చర్యపోయింది.

"ఏమండీ—ఆరోగ్యం బాగాలేదా ?"

తలెత్తి చూశారు శేషయ్య....పిండి విసరుతూ విసరుతూ మధ్యలో లేచి వచ్చిందేమో, పిండి మరకలతో నిండి ఉంది ఆమె మొహం. అక్కడక్కడ నెరసిన జుట్టుతో, చెమ టకు తడిసి చెదురుతున్న పెద్ద కుంకుమ బొట్టుతో—తన ఎదుట నిల్చిన పార్వతమ్మను చూడగానే—'నాతో జీవించ డానికి ఎన్నుకున్నదే ఈమె—' అన్పించింది శేషయ్యగారికి.

"పలకరేవండీ—?"

"పార్వతీ ! మనం ఇంత పెద్ద ఇంటో ఇకమీద ఉండ లేము".

"పోనివ్వండి చిన్న ఇంటోకే వెడదాము. కానీ—అసలు విషయం—"

"ఇవాళ నా ఉద్యోగానికి రాజీనామా యిచ్చాను—"

అక్కడే నేలమీద కూర్చుంది పార్వతమ్మ ....

...... మరో నెలరోజుల లోపుగా చిన్న వాటాలోకి మారారు శేషయ్య కుటుంబం. ప్రసాదు బి. ఏ. రెండో ఏడూ, అపర్ణ ఇంటర్మీడియేటుమొదటిఏడూ చదువుతున్నారు. వారి చదువుల మొక్కలకు, శేషయ్యగా రుద్యోగంలో ఉండగా నిలవచేసిన కొంత మొత్తం ప్రాణాధార మయింది.

శేషయ్య నాలుగు ట్యూషన్లు మొదలెట్టారు. చుట్టు పక్కల దగ్గర ఊళ్లు తిరిగి ఒక ఆయుర్వేద కంపెనీ మందు లమ్మే పనికి కూడా ఒప్పుకున్నారు. కాలం నడుస్తున్నది కొండ చిలువలా. జూన్ వచ్చింది. వేసవి సెలవులు వచ్చాయి. తాను బియ్యే మొదటి తరగతిలో పాసయినట్లు అనధికార వార్త అందినట్లు నాన్నతో చెప్పాలని సంకల్పించాడు ప్రసాదు.

కానీ—అయిదోఫారం చదువుతుండగా ఆరు నెలల పరీక్షల కొక వారం ముందు, శేషయ్య ప్రసాద్ కొక అధ్యాయం చూపించి దానిలోని లెక్క లన్నిటినీ రాత్రిలోగా చేసి చూపించ మని చెప్పి ఆఫీసు కెళ్లారు. ప్రాణమిత్రుల ప్రోద్బలంవల్ల, అభిమానతారలచిత్రం ఆఖరిరో జవడంవల్ల ప్రసాదు ఆ సాయం కాలం సినిమాకు వెళ్లవలసి వచ్చింది. ఎలాగయితేనేం రాత్రి పదింటికి ఆ అధ్యాయం గురించి తండ్రి అడగ్గా, పుత్రుడు అధ్యాయంలో ఉన్న పాతికింటిలోనూ పది లెక్కలు మిగిలి ఉన్నాయని గొణిగాడు. అంతే ! శేషయ్యగారు చేతికందిన గొడుగు తీసుకున్నారు. పార్వతమ్మ అడ్డుపడింది. ఆవేశ అన్నారు శేషయ్య—"నీ యిష్టం వచ్చినట్లు చేసుకో వెధవా ! నీ బాగు, నీ బాధ్యత నువ్వు తెలుసుకోవలసిన వయస్సు వచ్చింది —ఇక చస్తే నీ చదువు గురించి నిన్నడగను ఫో !!"—అప్పటినుంచీ ఈనాటివరకు ప్రసాదు ఎసెసెల్సీగాని, ఇంటర్ గాని, మరోటిగాని ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాననో, డిస్టింక్షన్ వచ్చిందనో అని చెబితే—"ఓ !" అంటారు శేషయ్య.

—కనక బి. ఏ. పరీక్ష ఫలితాలు పత్రికలలో వచ్చిం తర్వాతే చెబుదామని నిర్ణయించుకుంటున్నాడు ప్రసాదు. కొడుకు తన సమీపంలో తచ్చాడుతుండడం గమనించిన శేషయ్య—"ఏరా ?" అన్నారు.

"ఓ పదిరోజులపాటు బొంబాయి వెళ్లొస్తా నాన్నా!"

"అక్క డెవరున్నారురా—"

"మా కాలేజీవాళ్లు నలుగురు వెళ్తున్నారు. అందుల ఒకతని బాబాయి అక్కడ ఉన్నారు. వాళ్లింటో దిగుతాం బొంబాయి తర్వాత, మహాబలేశ్వర్, పూనా చూచి వద్దా మనుకుంటున్నాం నాన్నా !"

"ఎప్పుడు వెళ్తారు—"

"ఎల్లుండి సాయంకాలం బయలుదేరాలని—"

"సరే ! అమ్మ నడిగి డబ్బు తీసుకో—"

నాన్నంటే ఉన్న భయంకొద్దీ ఈల వేయలేదు కాని, మహోత్సాహంతో బయటికి వెళ్లిపోయాడు ప్రసాదు.

కొంతసేపటికి—పార్వతమ్మ అటు రాగా, శేషయ్యగారు ప్రసాదు యాత్ర విషయం ప్రస్తావించి, అడిగితే వాడికి డబ్బిమ్మన్నారు.

"ఇప్పుడు వీడు వెళ్లడం ఎందుకట ?" అని అడిగింది ఆవిడ.

"సరదాగా స్నేహితులతో కలిసి వెళ్లొస్తాడట !"

"ఏవిటీ—సరదాగా బొంబాయికా !! బోడివెధవ !—రానివ్వండి. నేను చెబుతాను. ఓ ప్రక్కన ఆ మూడు వేల లోనూ వెయ్యికి పైగా అయిపోయిందే, ఇంకా దాని చదువూ, పెళ్లి ఉన్నాయే—ఇవన్నీ ఎలాగా అని సతమత మవుతుంటే వీడో వంద తగలేసి బొంబాయికి వెళ్తాడా—"

"పోనీ పార్వతీ—"

"అదేవిటండీ—ఇరవై యేళ్లు మహరాజులా బ్రతికి ఇప్పుడేమో ట్యూషన్లనీ, మందులనీ, నానా చాకిరీ చేస్తుంటే వీడికి సరదా లేవిటండీ ?"

"ఒక్కొక్క వయస్సులో ఒక్కో సరదా ఉంటుంది. అది అప్పుడే తీరిపోవాలి తెలుసా—"

"మరి మీకు మాత్రం ఆ వయసులో సరదాలు లేవేమిటి—"

నవ్వారు శేషయ్య .... ఏడవఏట అమ్మ పోగా, ఆమె వెళ్లిపోయిన పదోనెల నాన్న పోగా, స్వగ్రామం విడిచివచ్చి చెన్న పట్నం చేరి అప్పుడు 'అ ఆ' లు మొదలెట్టి మెట్రిక్ ఫెయి లయి, ఒక కోమటి కొట్లో గుమాస్తాగా చేరి, పెళ్లి చేసు కున్నారు ఆయన. జీవితపు మొదటి మెట్టుమీద అనాథగా అడుగుపెట్టిన ఆయన, అందరిలోనూ తానూ ఒకడుగా అని పించుకోవడానికే అష్టకష్టాలూ పడవలసి వచ్చినప్పుడు—సర దాలకు సందెక్కడ ?—ఆ విషయం పార్వతమ్మకు తెలుసు. అందుకనే ఆ ప్రశ్న అడిగింది.

"ఆ రోజుల్లో కుర్రవాళ్లకు ఇన్ని ఊహ లుండేవి కావనుకో—" అన్నా రాయన.

"అయితే కావచ్చు కాని, వీడో ఉద్యోగం సంపాదించి కుటుంబానికి సాయపడవలసినవాడు కదా—వాడి బాధ్యతలు వాడికి తెలియవద్దూ— ?"

"వాడి ఉద్యోగం !—వాడి సంపాదనా !" అన్నారు. శేషయ్య— "వాడి కాళ్లమీద వాడు నిలబడగల్గితే చాలు పార్వతీ .... నా చెయ్యి ఆడినంతవరకూ నా కింకొక్కరి ఆధారం అక్కర్లేదు—"

"హుం .... ఎన్ని చెబుతే నేం .... మీ పట్టుదలే మీది... ఒకప్పుడు నా మాట విన్నారు గనుకనా .... నా మాటే విని ఉంటే ఆ ఏడువేలూ పొయ్యేవా—ఈనా డిట్లా ఉందుమా—" అని లోపలికి వెళ్లింది పార్వతమ్మ.

—శేషయ్య నారాయణ కార్ఖానాలో మేనేజరు ఉద్యోగం చేస్తుండగా, పొదుపుగా జీవించి దాదాపు పదివేల రూపాయలదాకా నిలవచేశారు. ఆయన మిత్రు డొకడు తన వ్యాపారం క్రుంగిపోతూన్నదని, తక్షణం గనుక ఏడువేల రూపాయలు ఎవరయినా ఇవ్వకపోతే వ్యాపారం దివాలా తీస్తుం దని, తాను పెళ్లాం, పిల్లలతో వీథి మీదికి వెళ్లవలసి వస్తుం దనీ ఏడిచాడు. కష్టాల నెరిగిన శేషయ్య తోటిమానవుడికి చేయూత నివ్వడం తన ధర్మంగా భావించారు. పిల్లలు ఇద్ద రున్నారనీ, వాళ్ల చదువులూ, పెళ్లిళ్లూ ఉన్నాయనీ, డబ్బు నలా ఇచ్చేయవద్దనీ పార్వతమ్మ కోరింది. కాని ఆమె మాట వినపడలేదు శేషయ్యకు. పత్రమన్నా రాయించుకోకుండా ఏడు వేల రూపాయలు అప్పుగా ఆ మిత్రుడికి ఇచ్చారు.

అలా యిచ్చి ఆరేళ్లయింది. ఆ మొత్తంలో వందయినా వెనక్కు రాలేదు. "ఆ ఏడువేలూ బ్యాంకిలో ఉంటే ఈ ఆరే ళ్లలో వడ్డీ మాత్రమే వెయ్యి రూపాయ లయ్యేది" అని పార్వతమ అన్నప్పుడల్లా "పాపం ! అతడు మాత్రం ఏం చేస్తాడు పార్వతీ .... వ్యాపారం బొత్తిగా పడిపోయింది కదా .... ఏదో ప్రయత్నాలు చేస్తున్నాడు. ఏదయినా కాస్త దారికి వస్తే మన డబ్బు మన కిచ్చేస్తాడు" అంటూంటారు శేషయ్య.

—కాని ఆరోజు తన మాట వినివుంటే ఈనాడు ఈయ నిలా మందుల సంచులు పట్టుకుని ఊరూరూ తిరగ వలసి వచ్చేది కాదే—అని పార్వతమ్మ బాధ. ఎన్నిసార్లు వెళ్ల గక్కినా ఆ ఆరాటం తగ్గేదికాదు. ప్రసాదు బొంబాయి యాత్ర విషయంలోనూ అదే అన్పించింది. 'ఆరుగురు పిల్లలు పోయిన తర్వాత అబ్బాయి పుట్టాడు. వాడూ బతికి బట్ట కడతా డనుకోలేదు. కాని అన్ని అరిష్టాలూ దాటి వా డీనాటికో మగాడయి, మోజుపడి బొంబాయి వెళ్తానంటుంటే—తాను, కన్నతల్లి, అభ్యంతరం చెప్పవలసి వస్తున్నదే—దారిద్ర్యం అన్నది ఎంత భయంకరం ! .... ఆయన 'వద్దు'—అంటే అబ్బాయి బొంబాయి వెళ్లడు .... అయినా ఆయన అలా అనలేదు. ఆయనకు డబ్బు పరిస్థితి తెలియకనా .... తాను ఎన్ని అవ స్థలు పడ్డా సరే, కనీసం జీవితంలోకి అడుగుపెట్టేదాకా అయినా అబ్బాయి నిర్విచారంగా ఉండాలని కాబోలు ! .... ఆ కన్నకడుపు తీపి తనకు తెలియనిదా—' అని కూడా అన్పిం చింది పార్వతమ్మకు. అనిపించిన వెంటనే వెళ్లి ఆయనతో "ఏమండీ ! ఇందాకా ఏదో అన్నాను కాని .... వాడికో వంద ఇస్తే చాలుతుం దంటారా—?" అని అడుగుదామని తోచింది. వెంటనే లేచి గబగబా వెళ్లింది.

శేషయ్య ధోవతీ, చొక్కా, కోటూ ధరించి అంగ వస్త్రంమీద వేసుకుంటున్నారు—"పార్వతీ .... ఆ మందుల

సంచి ఇలా తే—! పొన్నేరిదాకా వెళ్లాలి; అక్కడొకతడు 'ద్రాక్షారుణ' కు ఆర్డరిస్తానన్నాడు. బహుశ రాత్రికి వచ్చేస్తాను" అన్నారు. పార్వతమ్మ మాట్లాడకుండా సంచి అందిచ్చింది. చేత బరువైన సంచి పట్టుకుని దారిద్ర్యపు ఎండలో నడిచిపోతూవున్న ఆయనను చూచిన చూపు చెమ్మగిల్లింది.

ఆ రాత్రి పది ఘంటలకు వచ్చారు శేషయ్య—"నాలుగు రోజుల తర్వాత రమ్మన్నాడు ఆ పొన్నేరి అతడు" అంటూ—

ఆ ప్రకటన విన్న పార్వతమ్మ ఉల్లం ఏమాత్రమూ చల్లగా లేదు.

మూడో రోజు పొద్దున్న ప్రసాదు బొంబాయి ఎక్స్‌ప్రెస్‌కు మిత్రులతో బయలుదేరాడు. అతడు బెడ్డింగుతో రిక్షా ఎక్కబోతుండగా అపర్ణ చెప్పింది—"అన్నయ్యా! క్షేమంగా వెళ్లి లాభంగా రా ! అలాగే నీ చెల్లాయి కొకటో, రెండో వాయిలు చీరలు తీసుకురా—"

"ఉన్నవి చాలవటే—" అంది వాళ్లమ్మ.

"తెస్తాన్లేవే !" అని రిక్షా ఎక్కాడు తన జీవితంలో మొదటిసారిగా వంద మైళ్ల కన్న ఎక్కువ దూరం ప్రయాణం చేయబోతున్న ప్రసాదు. ఆ రిక్షా వీధి మలుపు తిరిగిం తర్వాత కూడా కాసేపు గుమ్మంలో నిల్చింది పార్వతమ్మ ....

నాలుగవ రోజు సాయంకాలం ఏడు దాటిం తర్వాత శేషయ్య యింటికి వచ్చారు. బట్టలు మార్చుకుని కాళ్లు చేతులు కడుక్కొని సాయంసంధ్య కుపక్రమించారు. పార్వతమ్మ దేవుడి దీపాలు రెండూ వెలిగించింది. శేషయ్యగారి సంధ్య, పూజ ముగిశాయి. శేషయ్యగారికి అరిటాకు పరిచి అన్నం వడ్డించింది పార్వతమ్మ.

"ఏమండీ ! మీరో రెండు జతల పంచలు కొనుక్కోకూడదూ ?

"అలాగేలే—"

"ఇప్పటికి నాలు గయిదుసార్లు చెప్పాను. మీరేమో 'అలాగేలే' అని వూర్కుంటారు. నలుగురి దగ్గరకూ వెళ్లవలసినవారు కదా—మీకు సరయిన బట్టలు లేకపోతే ఎలా ...."

"అవునవును."

"అలాగని ఈసారి కూడా వూర్కుంటిరా, రేపబ్బాయి రాగానే వాడితోబాటు వెళ్లి నేనే కొని పట్టుకొస్తాను."

"అన్నట్టు అపర్ణేదీ—?" అని అడిగారు శేషయ్య.

"అది స్నేహితురాండ్రతో కలిసి సినిమాకు వెళ్లింది."

"ఓ !" అని కాసేపాగి పలికారు శేషయ్య .... "పార్వతీ—పోయిన వారమే కదూ ఏదో సంగీత కచ్చేరికని వెళ్లి పదింటికి వచ్చింది అపర్ణ .... "

పార్వతమ్మ తల వూపింది.

"అంతకు ముందొకటి రెండు సార్లు కూడా డ్రామా అనీ, మరోటనీ ఇంటికి ఆలస్యంగా వచ్చింది. అమ్మాయిని నువ్వు కాస్త మందలించాలి పార్వతీ !"

".... మొన్నసారి కూడా తన తరగతికంతా సెకెండ్‌గా వచ్చిందండీ అపర్ణ .... "

"చదువు విషయం కాదు నే నన్నది—"

పార్వతమ్మ కనుబొమలు పైకెగిరాయి.

ఇంకా అన్నారు శేషయ్య— "అది చిన్నది. ఆ వయసు మనసుకు బలం చాలా తక్కువ. కనుక మనం దానిని హెచ్చరించుకోవాలి."

"మన కడుపున పుట్టిన బిడ్డ ఎన్నడూ మరోలా ప్రవర్తించదు. ఇదివరలో మన వంశాన ఒక్కరు కూడా...."

"అదికాదు పార్వతీ .... ఎంత మంచి లత అయినా పెద్ద గాలి వీస్తే కనబడ్డ ముళ్లకంచెమీద పడి అల్లుకుపోతుంది.... చాలా పొరబాట్లలో—వ్యక్తి ఆలోచనకన్న పరిస్థితుల ప్రభావం ఎక్కువ—" అని లేచారు శేషయ్య.

ఆ రాత్రి అపర్ణతో వాళ్లమ్మ అరఘంటసేపు మాట్లాడింది.

ఇది జరిగిన రెండు రోజుల తర్వాత, ఒక రాత్రి ఎనిమిది గంటలవేళ, శేషయ్యగారు వీధిలోంచి ఇంటోకి వచ్చి చెప్పులు విడిచారో లేదో—వీధిలో .... "టెలిగ్రాం సార్ !" అన్న కేక విన్పించింది. పార్వతమ్మ దేవుడి గదిలో కూర్చునుంది. అపర్ణ నోట్సు వ్రాసుకుంటూంది.

శేషయ్యగారు టెలిగ్రాం నందుకుని చదివారు. గబగబ నడిచి కాళ్లు కడుక్కుని, పూజ గదిలోకి వెళ్లారు. దేవుడి దీపాలు వెలిగించి నమస్కరించి ఇటు తిరిగింది పార్వతమ్మ.

"పార్వతీ ! ముకుందరావు ఎవరూ ?" అని అడిగారు శేషయ్య.

ముకుందరావు ప్రసాద్ ప్రాణమిత్రులలో ఒకడనీ, మొన్న ప్రసాదు బొంబాయి వెళ్లినప్పుడు ఆ ముకుందరావు వాళ్ల బాబాయి ఇంటోనే దిగుతామని చెప్పాడనీ వివరించిన పార్వతమ్మ, శేషయ్య చేతిలోని కాగితంముక్క వైపు భయంతో చూసింది.

"అమ్మవారు మనల్నింకా పరీక్షిస్తూంది పార్వతీ !" అని తనచేతి కాగితపు బరువును మాటలలోకి మార్చి అందించారు శేషయ్య.

కుప్పగా కూలింది పార్వతమ్మ.

"వరుసగా ఆరుగుర్ని పోగొట్టుకున్న తర్వాత వీ డొక్కడు మిగిలా డనుకున్నాను. ఇరవై యేళ్లపాటు మమ్మల్ని మురిపించి మురిపించి ఇప్పుడు తీసుకువెళ్లావా అమ్మా .... కళకళలాడుతున్న నా బాబుకు పరాయి ఊళ్లో కారు ప్రమాదంలో ముగింపా తల్లీ—!' అని రోదించింది ఆమె అంతరంగం.

అది శిశిరం—

—ఇంకో శిశిరం వచ్చి వెళ్లింది.

పార్వతమ్మ ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడ్డం లేదు. శేషయ్యగారు మందుల అమ్మకానికి మునుపటికి మల్లే తిరగలేక పోయారు. ఆయన ట్యూషను కుర్రాళ్లలో ఇద్దరు ఎసెసెల్సీ పాసయారు. ఇపుడాయనవద్ద ఇద్దరే కుర్రాళ్లు చదువుకుంటున్నారు.

ఒకరోజు ఆయన ట్యూషన్లు ముగించుకుని దారిలోని అరుణాచలేశ్వరాలయంలోకి అడుగుపెట్టారు. అక్కడ అర్చన వైభవాన్ని చూచి ఆనందించి నెమ్మదిగా ఇంటికి వచ్చారు.

ముందు గదిలో ఎవరో ఒకతడు కూర్చుని ఉన్నాడు.

నుదుట కుంకుమబొట్టుతో, గళాన మంగళసూత్రంతో మధ్య హాల్లో నిలిచివుంది అపర్ణ.

వెక్కిళ్లతో ఒకమూల కూర్చునుంది పార్వతమ్మ.

"నన్ను క్షమించు నాన్నా! మరొక కులం వరుడితో నా పెళ్లిని మీరు అనుమతించరనే భయంతో మీకు చెప్పకుండా నేను ఆయన్ను భర్తగా స్వీకరించాను. ఆయన లేనివాడు నా మనుగడకే అర్థంలేదు. అందుకని నా మనస్సుకు నేనే వెయ్యి సమాధానాలు చెప్పుకుని ఇలా చేయవలసి వచ్చింది .... దేవతల వంటి మిమ్మల్నిద్దరినీ కాదనవలసి వచ్చింది. దురదృష్టవంతు రాలిని—" అంటున్న అపర్ణ స్వరం కూడా వినకుండా లోప లికి వెళ్లి శేషయ్యగారు—"పార్వతీ!" అన్నారు.

"పార్వతీ!—అక్కడ నిలుచున్న ఆ ఆడమనిషినీ, ఆ ఇంకో వ్యక్తినీ మనకు తెలియదు. వాళ్లిద్దరినీ వెళ్లిపొమ్మను—"

పార్వతమ్మ గుండె పగిలింది. దేవుడి గదిలో రెండో దీపమూ ఆరింది.

కాసేపటికి ఆ ఇంటో ఆమె ఆయన మాత్రమే మిగిలారు.

ఆ రాత్రి మంచంమీద పడుకున్న పార్వతమ్మ నెల రోజులదాకా లేవలేదు. శేషయ్య మందుల అమ్మకం మాను కున్నారు. ఆయన ట్యూషన్ కుర్రాళ్లు ఇద్దరూ ఇంటికే రాసాగారు. వాళ్లిద్దరిలో పెద్దవాడు నీలకంఠం ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజరుగా రబ్బాయి—అయిదోఫారం చదువుతున్నాడు. రెండోవాడు—బంగారు శెట్టి ఆఖరబ్బాయి కామేశం—మూడో ఫారం విద్యార్థి.

నెల రోజుల తర్వాత పార్వతమ్మ నెమ్మదిగా లేచి నీడలా తిరగసాగింది. శేషయ్యగా రాశ్టే ఇల్లు విడిచి కదలడంలేదు.

ఒక ఆదివారం పొద్దున కుర్రాళ్లిద్దరికీ చదువు చెబు తున్నారు శేషయ్య. తెలుగు పాఠం చదువుతున్న నీలకంఠం అడి గాడు: "మరి మేష్టారూ! మహాభారతంలో భీష్ముడావిధంగా ప్రతిజ్ఞ చేయడంవలన తానన్ని కష్టాలూ పడ్డాడు. పైపెచ్చు అందువల్లే పాండవులూ, కౌరవులూ, భారత యుద్ధమూ వచ్చాయి. ఆయన గనుక పెళ్లే చేసుకుని వుంటే ఆయనా సుఖపడేవాడు, భారత యుద్ధం వచ్చేదే కాదేమో, కదండీ?"

శేషయ్య నవ్వారు. "ఒరేయ్ అబ్బాయ్! భీష్ముడు నీలాటి నాలాటి వాడు కాడు. మహావ్యక్తి. ఆయనలాటివా రనుస రించే మార్గం ఒక్కటే—అది ధర్మమార్గం. ఇహ మన కష్ట సుఖా లనేవి అంటావా వాటి స్వరూపం మన ఆలోచనలను బట్టి మారుతుంది. ఇహ భారతయుద్ధమా, అది జరుగ వలసి వున్నది. జరిగింది. అందుకు కౌరవులూ, పాండవులూ వగైరా అంతా కారణమాత్రులే—" అని కాస్సేపాగి— "అవును—అంతా కారణమాత్రులే!" అన్నారు. నీలకంఠానికి అర్థమయీ కానట్లుండింది.

అర్థమవకపోతేనేం గాక. వాడు ఆ ఏడు అయిదో ఫారమూ ఆ తర్వాత ఆరో ఫారమూ అద్భుతమయిన మార్కులతో పాస యాడు. పాసయిన సందర్భంలో అయ్యవారికి పండ్లూ, తాంబూలమూ పెట్టి ధోవతుల జత సమర్పించాడు. వాడి తల నిమిరిన శేషయ్యగారి కళ్లలోని మబ్బులను ఒక్కరే గుర్తించారు.

అయిదో ఫారంలో కొచ్చిన కామేశం గాక మరిద్దరు శేషయ్యగారి దగ్గర చదువు చెప్పించుకోసాగారు.

ఒకరోజు మధ్యాహ్నం భోజనంచేసి కునుకు తీశారు శేషయ్య. ఆయనకో కల వచ్చింది.

తనే .... ఎక్కడో కూర్చుని ఉండగా ....ఎర్రటి పావడా గౌనూ వేసుకుని, కిరణంలా వెలిగిపోతున్న అమ్మాయి గెంతు కుంటూ గెంతుకుంటూ వచ్చింది. లేచి అమ్మాయి నెత్తుకో పోయారు శేషయ్య. ఈ లోపుగా గాండ్రుమంటూ వచ్చింది ఒక పెద్ద సింహం. అంత భయంకరంగా వచ్చిన ఆ మృగం ఆ అమ్మాయిని చూడగానే తోక ముడుచుకుని తల వంచుకుని నిల్చుంది. చలాకీగా సింహంమీద కెక్కి ఠీవిగా కూర్చుంది అమ్మాయి. సింహం పరుగెత్తసాగింది. దాని వెంబడే పరు గెత్తసాగారు శేషయ్య ......

ఈలోపుగా పదవసారిగా పిలిచింది పార్వతమ్మ— "ఏమండీ!" అని. ఆమె చేతిలో ఓ కవరుంది.

కళ్లు నులుముకుంటూ లేచిన శేషయ్య—"అమ్మవారు కన్పించింది పార్వతీ!" అన్నారు. అని ఆమె చేతిలోని కవరు అందుకుని, చింపి, ఉత్తరం తీసి చదువుకున్నారు.

"ఎవరిదగ్గరనుండీ?" అని అడిగింది పార్వతమ్మ.

"మా మందుల కంపెనీ నెల్లూరు ఏజెంటు రాశాడు. ఆ దురదృష్టవంతురాలు—అపర్ణ—ఒక అమ్మాయిని కని సంవత్సరం క్రిందట చనిపోయిందట. దాని మొగుడు తాగుడు లోకి దిగాడట. పోషణలేక కృషించిపోతున్న ఆ ఏడాది పసి కుంకను తన దగ్గరకు తీసుకొచ్చుకుని ఇతడు నాకు రాశాడు."

చీరె చెంగుతో కళ్లొత్తుకుంది పార్వతమ్మ.

జగన్మాతయే తల్లియై, తండ్రియై ఆ పసిపాపను చిరంజీవిగా చేయాలని అర్థించింది ఒక హృదయం.